క్లుప్తంగా

తహసీల్దార్, ఎంపీడీఓ బదిలీ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తహసీల్దార్, ఎంపీడీఓలు బదిలీ అయ్యారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లాకు, ఎంపీడీఓ మహేశ్‌బాబు వికారాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఇద్దరు అధికారులు మూడు ఏళ్లకు పైనే మండల ప్రజలకు సేవలందించారు.

చేవెళ్ల నుంచి అయోధ్యకు..

చేవెళ్ల: అయోధ్యలోని బాలరాముని దర్శనానికి చేవెళ్ల నుంచి భక్తులు, బీజేపీ శ్రేణులు వెళ్లారు. ఆదివారం చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి అయోధ్య యాత్రకు వెళ్లారు. భక్తులకు నియోజకవర్గ బీజేపీ నాయకులు రైల్వే బోగీలను బుక్ చేశారు. భక్తుల యాత్ర విజయవంతం కావాలని స్థానికులు ఆకాంక్షించారు.

రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి


రేషన్ షాపు వద్ద మహిళల క్యూ

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీరాంనగర్ లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయడంలో డీలర్ వెంకటయ్య ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి రేషన్ బియ్యం కోసం వచ్చిన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం రాత్రి సమయంలో ఇవ్వడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని మహిళలు మండిపడ్డారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రేషన్ డీలర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శివాలయాన్ని సందర్శించిన సినీ హీరో


హరీశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: చందిప్ప మరకత శివాలయాన్ని 'ప్రేమఖైదీ'సినిమా కథానాయకుడు హరీశ్ ఆదివారం సందర్శించారు. మరకత శివలింగానికి ప్రత్యేక అభిషేక పూజా క్యాక్రమాలు నిర్వహించారు. మహిమ కల్గిన శివలింగాని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. పురాతన ఆలయాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సదానందం, దయాకర్‌రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంను సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఈ సమావేశంలో ఇటీవల పదవీ విరమణ పొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అదే విధంగా కృష్ణా ప్రాజెక్టుపై 13న నిర్వహించే నల్లగొండ బహిరంగ సభను విజయవంతం చేయుట గురించి చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు హాజరవుతున్నారు. గ్రామస్థాయి, మండలస్థాయి, మున్సిపల్, పట్టణస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ వేడుకలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. దేవాలయంలో ఆలయ చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఆలయంలోఉదయం అమ్మవారికి సుప్రభాతం, అభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నర్సింహ, డాక్టర్ శ్రీనివాస్, చంద్రశేఖర్, యాదయ్య, కుమారస్వామి, సత్యం, విజయ్, జగన్, రవీంద్ర, ఆనంద్, దేవేందర్, పూజారులు దినేష్, శ్రీనయ్య పాల్గొన్నారు.

వరివైపే మొగ్గు

- బియ్యం ధరలు పెరగడమే కారణం
- ముమ్మరంగా యాసంగి పనులు
- ఆలస్యమైనా కరిగెట్లు చేసి నాట్లు వేస్తున్న రైతులు
- దిగుబడి తగ్గుతుందంటున్న అధికారులు



యాసంగిలో వరిసాగుపై ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో అన్నదాతలు వరి సాగుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మండలవ్యాప్తంగా నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో పాటు భూగర్భ నీటి మట్టాలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు ముందడుగు వేస్తున్నారు. ఖరీఫ్‌లో వడ్లకు ఆశించిన స్థాయిలో మద్దతు ధర లభించింది. దీనికితోడు ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు ఆకాశానంటుతున్నాయి. దీంతో ఆలస్యమైనా యాసంగిలో వరిని సాగుచేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

మొయినాబాద్: వరిసాగుపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. యాసంగిలో చాలా మంది రైతులు వరి సాగుపైనే దృష్టి పెట్టారు. ఆలస్యమైనా కరిగెట్లు చేసి నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్ మహానగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలంలో చాలా మంది రైతులు పూలు, కూరగాయలతో పాటు వరి సాగు చేస్తారు. సాధారణంగా యాసంగిలో మాత్రం ఎక్కువ మంది పూలు, కూరగాయలపైనే దృష్టి పెడతారు. కానీ ఈ సారి చాలా మంది రైతులు వరి సాగుపై దృష్టి పెట్టారు. యాసంగి వరి సాగు డిసెంబర్, జనవరి నెలల్లోనే చేస్తారు. డిసెంబర్ మొదటి వారం నుంచి నార్లు పోసి జనవరి మొదటి వారం నుంచి నాట్లు వేస్తారు. కానీ ఈ సారి ఫిబ్రవరి రెండో వారం వచ్చినా ఇంకా చాలా మంది రైతులు కరిగెట్లు చేస్తున్నారు. నాట్లు వేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలోని చిలుకూరు, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, మేడిపల్లి, ఎలుకగూడ, పెద్దమంగళారం, అప్పారెడ్డిగూడ, చిన్నషాపూర్, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, కనకమామిడి, వెంకటాపూర్, సురంగల్, శ్రీరాంనగర్, అమ్డాపూర్, బాకారం, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో వరినాట్లు జోరుగా వేస్తున్నారు.

బియ్యం ధరలకు రెక్కలు

ఈ సారి బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. వానాకాలంలో వరి పండించిన రైతులు బియ్యాన్ని రూ.5,500–6,500 వరకు విక్రయించారు. గతేడాది బియ్యం ధరలు రూ.3,000–3,500 వరకు మాత్రమే ఉన్నాయి. ఈ సారి బియ్యం ధరలు పెరగడంతో రైతులు వరి వేసేందుకు రెడీ అవుతున్నారు. వానాకాలంలో వరిసాగు చేసిన రైతులు యాసంగిలో మళ్లీ వరినాట్లే వేస్తున్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 1,500 ఎకరాల్లో వరి సాగు అయింది. మరో వెయ్యి ఎకరాలకు పైగా సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

వరిసాగే లాభసాటి



భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో నీళ్లు ఉండటంతో వరి పంట సాగుచేయడమే లాభసాటిగా ఉంది. ఈ సారి ధాన్యం, బియ్యం ధరలు పెరిగాయి. వానాకాలంలో వరిసాగు చేశాను. బియ్యం పట్టించి విక్రయించాను. బియ్యం ధర క్వింటాలు రూ.5,000 పైగా విక్రయించాను. అందుకే యాసంగిలోనూ రెండెకరాలు వరిసాగు చేశాను.

– పళ్లారి శ్రీనివాస్, రైతు, అప్పారెడ్డిగూడ

దిగుబడి తగ్గుతుంది



రెండేళ్లుగా యాసంగిలో వరిసాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు ఈ సారి కూడా చాలా మంది రై తులు వరి నాట్లు వేస్తున్నా రు. ఇప్పటికే మండలంలో 1,500 ఎకరాల్లో వరిసాగు అయింది. ఫిబ్రవరి 15లోపే నాట్లు పూర్తి కావాలి. ఆలస్యంగా వేస్తే దిగుబడి తగ్గే అవ కాశం ఉంటుంది. వరికోత సమయంలో అకాల వర్షాలు, వడగళ్లు పడే అవకాశం ఉంటుంది.

– రాగమ్మ, మండల వ్యవసాయాధికారి, మొయినాబాద్

'గృహజ్యోతి'తో

పేదలకు ఊరట

కాంగ్రెస్ షాబాద్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్


అర్హుల నుంచి వివరాలు సేకరిస్తున్న చంద్రశేఖర్, నరేందర్‌నాయక్ తదితరులు

షాబాద్: గృహజ్యోతి పథకంతో పేదలకు ఊరట లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలను విద్యుత్‌శాఖ ఏఈ నాగేందర్‌నాయక్ తన సిబ్బందితో వినియోగదారుల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలు సిబ్బందికి అందజేయాలని సూచించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో వినియోగదారుల వివరాల సేకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, రవి, వెంకట్‌రెడ్డి, గోపాల్, రామకృష్ణ, శంకర్, భిక్షపతి, విద్యుత్ సిబ్బంది తదితరులున్నారు.

మానవత్వం చాటిన యువకుడు

- నిరుపేద కుటుంబానికి చేయూత
- రూ.6 లక్షలతో నూతన ఇంటి నిర్మాణం
- ఘనంగా గృహప్రవేశం


గృహప్రవేశంలో పాల్గొన్న మల్లేశ్‌యాదవ్, గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్: గతేడాది కురిసిన వర్షాలకు ఆ నిరుపేద ఇల్లు కూలిపోయింది. శిథిలమైన ఆ ఇంట్లో తల దాచుకోవడం కష్టంగా మారింది. ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను చూసి ఓ యువకుడు నేనున్నానంటూ ముందుకు వచ్చాడు. ఇంటి నిర్మాణానికి పూర్తి సహకారం అందించాడు. ఇల్లు నిర్మించి ఆదివారం గ్రామస్తులతో కలిసి ఘనంగా గృహ ప్రవేశం చేయించాడు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో బేడబుడగజంగాల సామాజిక వర్గానికి చెందిన కల్లెపల్లి మల్లేశ్ ఊరూరు తిరుగుతూ భిక్షటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మల్లేశ్‌కు భార్య లక్ష్మితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు మల్లేశ్ ఇల్లు కూలిపోయింది. ఇంటిని బాగుచేసుకునే స్తోమత లేక కూలిన ఇంట్లోనే తల దాచుకుంటున్నారు. ఆ కుటుంబ స్థితిని చూసిన అదే గ్రామానికి చెందిన కుర్వ మల్లేశ్‌యాదవ్ ముందుకు వచ్చాడు. నూతన ఇంటి నిర్మాణానికి చేయూతనందించాడు. రూ 6లక్షలతో మల్లేశ్‌కు గ్రామంలో అన్ని వసతులతో నూతన ఇంటిని నిర్మించి ఇచ్చాడు. ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో ఆదివారం గ్రామస్తుందరినీ ఆహ్వానించి వాస్తుపూజ, గృహప్రవేశ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాడు. గృహప్రవేశానికి వచ్చిన గ్రామస్తులకు, మల్లేశ్ బంధువులను అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. మల్లేశ్‌యాదవ్‌ను గ్రామస్తులు సత్కరించారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి


దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నేతలు ఘనంగా నివాళి అర్పించారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీకి పునాదులు వేసిన మహనీయుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అని కొనియాడారు. జాతీయ వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అలుపెరుగని కృషి చేసిన దార్శనికుడు దీన్‌దయాళ్ అని అన్నారు. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం ఒకే జెండా అని దేశంలోని ప్రజలను ఒకే తాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారని గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, హరిభూషణ్, శ్యాంసుందర్, శివకుమార్, రాజు, విజయ్, పవన్, రాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవ నిర్వహణ కమిటీ ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న పాఠశాల పూర్వవిద్యార్థులు

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150 సంవత్సరాలను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ సంబరాల నిర్వహణకు సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వార్షికోత్సవ సంబరాల నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా శ్యాంసుందర్, గౌరవ కార్యదర్శిగా మురళీధర్, అధ్యక్షుడిగా రాధాకృష్ణ, కార్యదర్శిగా ఆనందీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా శివగంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరితో వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. తదుపరి సన్నాహక సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహించి వార్షికోత్సవాన్ని ఎప్పుడు నిర్వహించాలనేది నిర్ణయించడం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో భవానిశంకర్, మల్లేశ్, సిరాజోద్దీన్, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చించోడ్ దర్గాలో ఉత్సవాలు


ప్రార్థనలు చేస్తున్న భక్తులు

షాద్‌నగర్: మండల పరిధిలోని చించోడ్‌లోని హజ్రత్ మౌలాలీ దర్గాలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా భక్తులందరూ పెద్ద ఎత్తున ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనడం అభినందనీయని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో మెరాజ్ మజీద్ నుంచి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు

లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలి



మొయినాబాద్: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో రాణించాలంటే లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని సహాయత ట్రస్ట్ చైర్మన్ మంజూర్ గోరి అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని చాలెంజర్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ అభివృద్ధి డైరెక్టర్ అమిరుల్లాఖాన్, సహాయత ట్రస్ట్ సీఈఓ సయ్యద్ అనిసుద్దీన్, ప్రిన్సిపాల్ శగుఫ్తాపర్వీన్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి వివరాలివ్వండి

ఏఈ సందీప్‌కుమార్

యాచారం: గృహజ్యోతి పథకం అర్హుల వివరాల సేకరణకు ప్రజలు సహకరించాలని మండల విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది బిల్లింగ్ కొడుతున్న సమయంలో గృహజ్యోతి దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ ఇవ్వాలని వినియోగదారులను కోరారు. అందుబాటులో లేని పక్షంలో పూర్తివివరాలు విద్యుత్ మీటర్ వద్ద ఉంచితే మా సిబ్బందే నమోదు చేసుకుంటారని తెలిపారు.

వైద్య శిబిరాలు అభినందనీయం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగుల దశరథం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో హైదరాబాద్‌లోని విశ్వాస్ ఆస్పత్రి వారి సౌజన్యంతో కానుగుల దశరథం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, అస్తమా, జలుబు తదితర తాత్కాలిక జబ్బులతో పాటు గుండె, కిడ్నీలు, వెన్నునొప్పి, డయాల సిస్ తదితర శాశ్వత రోగాలకు పరీక్షలు నిర్వహించారు. సుమారు 430 మంది రోగులను పరీక్షించి రూ.50వేలు విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్, ప్రకాశ్‌గౌడ్, ఆదర్శ్ యాదవ్, భరత్, శివకుమార్, బోదాస్ శ్రీకాంత్, మణికంఠ, వైద్యులు పాల్గొన్నారు.

మహితి పాలి క్లినిక్‌లో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మహతి పాలి క్లినిక్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో డాక్టర్ శేషం శ్రీనిధి ఆధ్వర్యంలో 90 మంది మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోమరాజు, యాదగిరి, మహతి పాలి క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహేశ్‌కు నేషనల్ అవార్డు



మహేశ్‌కు అవార్డు అందజేస్తున్న రాధాకృష్ణ తదితరులు

మొయినాబాద్ రూరల్: సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో మొయినాబాద్ మండల బీఆర్‌ఎస్ మాజీ యువజన అధ్యక్షుడు మహేశ్ యాదవ్ ఎంతో కృషి చేస్తున్నారని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ నాయకుడు నల్లూరి రాధాకృష్ణ కొనియాడారు. మహేశ్‌కు బహుజన సాహిత్య అకాడమీ ద్వారా బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు అందజేశారని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నదీమ్‌నగర్ గ్రామానికి చెందిన మహేశ్‌కు ఆదివారం బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నగరంలో బెస్ట్ సర్వీస్ సొసైటీ అవార్డును ప్రధానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ బహుజన సాహిత్య అకాడమీ తనకు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డును అందించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

నవ సమాజ నిర్మాణమే లక్ష్యం

షాబాద్: నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా బహుజన సాహిత్య అకాడమీ పని చేస్తుందని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ 7వ సౌత్ ఇండియన్ కాన్ఫరెన్స్‌లో అవార్డుల ప్రధానం చేశారు. చేవెళ్ల డివిజన్ జర్నలిస్టు కృష్ణ బహుజన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.

ఆటలు ఎలా..!


ముట్పూర్ క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

- గ్రామీణ క్రీడాకారులకు అందని ప్రోత్సాహం
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించే దిశగా పల్లెప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు వెక్కిరిస్తున్నాయి. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో ప్రతి పల్లెలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. క్రీడా ప్రాంగణాలను కనీసం ఎకరం భూమిలోనైనా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మైదానాల ఏర్పాటు కోసం అప్పట్లో ఉపాధిహామీ పథకం నుంచి దాదాపు రూ.4 లక్షల వరకు ఖర్చుచేశారు. కొన్ని గ్రామాల్లో సరిపడ ప్రభుత్వ స్థలం లభించకపోవడంతో పది గుంటల స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి కేటాయించారు.

అందుబాటులో లేని క్రీడా మైదానాలు

చాలా గ్రామాల్లో క్రీడా మైదానాల కోసం ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో గ్రామానికి దూరంగా స్థలం కేటాయించారు. అప్పట్లో అధికారులు యుద్ధ ప్రాతిపదికన మైదానాలను సిద్ధం చేయించారు. కానీ పద్మారం, జాకారం, రావిర్యాల, తదితర గ్రామాల్లో ఇంకా క్రీడా ప్రాంగణాలు పూర్తి కాలేదు. కొందుర్గు మండలంలో 22 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు రూ.50 లక్షలు ఖర్చు చేసి 22 క్రీడా మైదానాలు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కేవలం రెండు, మూడు గ్రామాలు మినహాయించి ఏ గ్రామంలోనూ క్రీడా ప్రాంగణం వినియోగంలోకి రాకపోవడం బాధాకరం. ఇక జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను రూ. 50 లక్షల వరకు ఖర్చు చేసి 20 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కానీ ఎక్కడ కూడా క్రీడాకారులు వినియోగించుకోకపోవడం విశేషం. ఇక రెండు మండలాల్లోను ప్రతి ఏటా క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర టోర్నమెంట్లు నిర్వహిస్తుంటారు. క్రీడా మైదానాలు లేకపోవడంతో రైతుల పట్టా భూముల్లో టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు.